క్లుప్తంగా

రేపు పెడనలో మెగా జాబ్‌మేళా

పెడన: విజయవాడకు చెందిన వెంకట్ హెచ్ ఆర్ సర్వీసెస్ వారిచే బంటుమిల్లి రోడ్డులోని పంక్షన్‌హాలులో మెగా జాబ్‌మేళాను ఆదివారం నిర్వహిస్తామని పెడన జయలక్ష్మీ పీఏసీఎస్ చైర్మన్ వరుదు రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే ఈ మేళాకు నిరుద్యోగులు హాజరై ఉద్యోగ అవకాశాలను పొందాలని చెప్పారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ, ఫార్మసీ, ఇతర విద్యార్హతలున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుర్రపుడెక్క తొలగింపు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరంలోని మురుగునీరు ప్రవహించే ప్రధాన డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నగరంలోని డ్రెయిన్ల ద్వారా మురుగునీరు రైల్వేస్టేషన్ ప్రాంతంలోని ప్రధాన డ్రెయిన్‌లో కలుస్తోంది. ఈ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో మురుగునీటి పారుదలకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులను నగర పాలక సంస్థ జేసీబీ సాయంతో చేపట్టారు. పనులను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పర్యవేక్షించారు.

జనసేన ఆరోపణలకు ఖండన

కోడూరు: పిట్టల్లంక పంచాయతీ పరిధిలో ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదంటూ జనసేన పార్టీ నేతలు చేసిన ఆరోపణలను వైఎస్సార్‌సీపీ నేతలు శుక్రవారం ఖండించారు. గ్రామంలో రూ.80 లక్షలతో సీసీ రహదారులు, రూ.43 లక్షలతో సచివాలయ భవనం, రూ.23 లక్షలతో ఆర్‌బీకే, రూ.2 లక్షలతో విలేజ్ క్లినిక్ మరమ్మతులు చేపట్టామని నాయకులు తెలిపారు. జనసేన నేతలు వర్షం పడిన రోజు రహదారి మధ్య నిలబడి నిరసన తెలపడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. పంచాయతీ పాలకులు జనసేన పార్టీకి చెందిన వారేనని, వీరు కనీసం పంచాయతీలో ఒక అభివృద్ధి కూడా చేసింది లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పంచాయతీలో డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయలేని పంచాయతీ పాలకులు ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఇంకొల్లు శేషగిరిరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ బావిశెట్టి పూలేంద్రరావు, గ్రామ కన్వీనర్ మలిశెట్టి వెంకటేశ్వరరావు, సంగా గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ ఎం. భాస్కరరావు తెలిపారు. ముస్తాఖాన్‌పేట, పోర్టురోడ్డు, పాత రామన్నపేట, జవ్వారుపేట, నాగపోతరావుసెంటర్, ఆజాద్‌రోడ్డు, గొడుగుపేట, ఎంజీగూడెం, బలరామునిపేట, నిజాంపేట, ఈడేపల్లి శక్తి గుడి సెంటర్, జిల్లా కోర్టు వెనుక ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

ఆర్‌బీకేలలో సబ్సిడీపై ఎరువులు సిద్ధం

కృత్తివెన్ను: ఖరీఫ్ సాగు చేసే రైతులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై అందిస్తున్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ జెన్నీ అన్నారు. మండల వ్యాప్తంగా అన్ని ఆర్‌బీకేలలో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, రైతులు సబ్సిడీపై అందిస్తున్న వీటి కోసం ఆయా ఆర్‌బీకేలలో సంప్రదించాలన్నారు. కొమాళ్లపూడి సీతనపల్లిలో యూరియా 5 మెట్రిక్ టన్నులు 14.35.14 ఎరువు 5 మెట్రిక్ టన్నుల చొప్పులు అందుబాటులో ఉన్నాయన్నారు. కృత్తివెన్నులో యూరియా 5 మెట్రిక్ టన్నులు, 20.20.20.13 ఎరువు 5 మెట్రిక్ టన్నుల చొప్పులు ఉన్నాయని చెప్పారు. లక్ష్మీపురంలో యూరియా 5 మెట్రిక్ టన్నులు, చినపాండ్రాక 2 ఆర్‌బీకేలో యూరియా పది మెట్రిక్ టన్నుల చొప్పున నిల్వలున్నాయని వివరించారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు సీట్లు

గూడూరు: గూడూరు మండలం కప్పలదొడ్డి, గూడూరు, మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. కప్పలదొడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పేరిశెట్టి పూర్ణిమ, యర్రా యువదుర్గా సూర్య, గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జోగి విజయమాధవి, మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తలారి శ్రీ విద్య, ఉట్ల మనోజ్‌కుమార్‌లు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు.

బందరు విద్యార్థుల సత్తా..

మచిలీపట్నంటౌన్: నగరంలోని రుస్తుంబాద బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి పీడీవీవీ నాగులు, దేశాయిపేట కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంవీవీ మహాలక్ష్మీ నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. దేశాయిపేట కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జె. పూజిత శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది.

బంటుమిల్లి: పెందుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని వక్కపాటి ప్రియరంజని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిందని ఎంఈఓ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆమెను పలువురు అభినందించారు.

ఆత్మబంధువులు.. గ్రామ వలంటీర్లు

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందించేందుకు నియమితులైన గ్రామ వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు ఆత్మ బంధువుల్లా సేవలు అందిస్తున్నారు. కేవలం అర్జీలు తీసుకుని పథకాల లబ్ధి చేకూరేలా సేవలకే పరిమితం కాకుండా ఆయా కుటుంబాల్లో విద్యాభివృద్ధికి కృషి చేసే వలంటీర్లు కూడా ఉన్నారు. చల్లపల్లి మండలంలోని 15 గ్రామ సచివాలయాల్లో 299 మంది గ్రామ వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. కోవిడ్ సమయంలో ఫీవర్ సర్వేలోను, కోవిడ్ సోకి ఇంటిలో ఉండి చికిత్స పొందిన వారికి మందులు అందజేయడంలోనూ గ్రామ వలంటీర్ల పాత్ర కీలకంగా నిలిచింది.

హైదరాబాద్ వచ్చి పింఛన్ ఇచ్చింది

నా పేరు శోభిల వెంకాయమ్మ. మాది చల్లపల్లి నారాయణరావు నగర్. నేను హైదరాబాదులో కుమార్తె ఇంటికి వెళ్లిన సమయంలో రెండు నెలలు పింఛన్ కోసం రాలేకపోయాను. మా గ్రామ వలంటీర్ శాంద్ర సురేఖ హైదరాబాద్ వరకు వచ్చి నా పింఛన్ డబ్బులు ఇచ్చింది. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన మా గ్రామ వలంటీర్ సురేఖ ప్రతి నెలా పింఛన్‌ను ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటికి వచ్చి అందిస్తోంది. ఇంతకు ముందు ప్రభుత్వంలో వృద్ధాప్యంలో పంచాయతీ కార్యాలయానికి వెళ్లి గంటల తరబడి పడిగాపులు పడాల్సి వచ్చేది. జగన్ ఏర్పాటు చేసిన గ్రామ వలంటీర్లు మంచి సేవలు అందిస్తున్నారు.



హైదరాబాదులో వెంకాయమ్మకు పింఛన్ ఇస్తున్న గ్రామ వలంటీర్ శాంద్ర సురేఖ

ఇంటి స్థలం ఇప్పించారు

నా పేరు మేకా అంకమ్మ. మేము చల్లపల్లి ప్రభుత్వ ఆస్పత్రి వెనుక మురికివాడలో గుడారాల్లో జీవిస్తాము. చిత్తు కాగితాలు ఏరుకుని కుటుంబాన్ని పోషించుకుంటాము. మా తాత ముత్తాతల నుంచి ఇదే గ్రామంలో ఏదో ఒక మూల గుడారాలు వేసుకుని జీవిస్తున్నాం. ఇక్కడ తొలగిస్తే ఇంకోచోట అలా బతుకు సాగిస్తున్నాం. ఈ ప్రభుత్వంలో మా ప్రాంతానికి గ్రామ వలంటీరుగా నియమితులైన శాంద్ర సురేఖ మా మురికివాడకు వచ్చి అందరి పేర్లు నమోదు చేసుకుని దరఖాస్తు చేయించి మాకంటూ ఒక స్థలాన్ని ప్రతి కుటుంబానికి జగనన్న కాలనీలో మంజూరు చేయించింది. ఆదుకునే దాతలు, అధికారులు అరుదుగా మా మురికివాడకు వచ్చి మా కష్టాలు వింటూ ఉంటారు. కానీ జగనన్న నియమించిన వలంటీర్ సురేఖ ప్రతినిత్యం మా మురికివాడకు వస్తూ మా కష్టాలు విని మాకు ఇళ్ల స్థలం వచ్చేలా చేయటం ఎంతో సంతోషం. ఇంటి స్థలం ఇచ్చిన జగనన్నకు రుణపడి ఉంటాం.



మేకా అంకమ్మ, చల్లపల్లి

మా పిల్లలను హాస్టల్‌లో చేర్పించింది

నా పేరు ఆరిగ గంగ. మేము చల్లపల్లి కోమలానగర్ పాత ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గుడారాల్లో ఉంటాము. మేము మురికివాడలో జీవిస్తూ చిత్తు కాగితాలు ఏరుకుని జీవిస్తున్నా మా పిల్లలను మాత్రం చదివించి ప్రయోజకులను చేయాలని ఆలోచన ఉండేది. మా పిల్లలు ముగ్గురు వినయ్ కుమార్, సాయికుమార్, జితేంద్ర ఎంపీపీ స్కూల్‌లో చదువుకున్నారు. మా గ్రామ వలంటీర్ శాంద్ర సురేఖ మాకు ప్రభుత్వ వసతి గృహం గురించి అవగాహన కల్పించి మా పిల్లలు ముగ్గురినీ చల్లపల్లిలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలో చేర్చి వారి ఉన్నత విద్యాభ్యాసానికి బాటలు వేసింది. ఆమెకు, ఇలాంటి మంచి గ్రామ వలంటీర్లను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.



పిల్లలను హాస్టల్‌లో చేరుస్తున్న ఆరిగ గంగ, వలంటీర్ సురేఖ

ఇంటికి వచ్చి భరోసా ఇచ్చారు

నా పేరు సోమిశెట్టి నాగ పార్వతీశ్వరమ్మ. మాది చల్లపల్లి రాధానగర్. కరోనా మహమ్మారి మొదటి విడత వచ్చినపుడు మా ఇంటి పరిసరాల్లో కరోనా బాధితులు ఉన్నారు. బయట ఒక్కరూ కనిపించే వారు కాదు. కరోనా ఎటు నుంచి వస్తుందో తెలియని రోజుల్లో మా గ్రామ సచివాలయం-3 వలంటీర్ మాచవరపు నవీన్, వైద్య సిబ్బందితో ఇంటికి వచ్చి జ్వర పరీక్షలు చేయించాడు. జ్వరం, జలుబు, దగ్గు ఎలాంటి లక్షణాలు ఉన్నా తగిన మందులు వేసుకోవాలని, భరోసా కల్పించి వెళ్లాడు. ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ వలంటీర్లు ఇంటికి వచ్చి మాలాంటి పెద్దవారికి ఉత్తమ సేవలు అందిస్తున్నారు.



సోమిశెట్టి నాగ పార్వతీశ్వరమ్మ

నిరుపేదల భూములు సెంటు కూడా పోకూడదు

మంత్రి జోగి రమేష్

పెడన: ఉమ్మడి కృష్ణా నుంచి పశ్చిమ గోదావరి జిల్లాలో కలిసిన వైవాక ప్రాంతంలో బంజరు భూములు కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలం రామవరపుమోడి, పెద తుమ్మిడికి చెందిన వారివి కూడా ఉన్నాయని, వాటిల్లో సెంటు భూమి కూడా పోకుండా రైతులకు న్యాయం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. శుక్రవారం బంటుమిల్లి పర్యటనకు ముందు పెడనలోని మంత్రి కార్యాలయానికి చేరుకున్నారు. రామవరపుమోడి గ్రామస్తులు మంత్రిని కలిసి భూముల సమస్యను మంత్రికి వివరించారు. పది రోజులు కిందట పశ్చిమ గోదావరి జిల్లా రెవెన్యూ అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా మా సాగు భూముల్లో జెండాలు పాతి కొత్తవారికి అప్పగించేలా చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. మంత్రి స్పందిస్తూ ముదినేపల్లి తహసీల్దారు, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.

జీవన్‌కుమార్ మృతిపై విచారణ జరిపించాలి

కోనేరుసెంటర్: జమ్ములమూడి జీవన్‌కుమార్ మృతిపై సమగ్ర విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మహాజన్ సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పి)నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఎస్పీ పి. జాషువాను కలిసి వినతిపత్రం అందజేశారు. పెద పులిపాకలో జరిగిన ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేయాలని నాయకులు కోరారు. ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కొల్లూరి బసవ, నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

మంత్రి జోగి రమేష్

గూడూరు: సంక్షేమ పథకాలకు అర్హులై ఉండి ధ్రువీకరణ పత్రాలు లేక లబ్ధి పొందలేకపోతున్న వారికి లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఆకులమన్నాడులో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకులమన్నాడు సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు 614 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ గతంలో ఏమైనా ధ్రువీకరణ పత్రం కావాలంటే మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలు సొంత గ్రామంలోనే పొందేలా సచివాలయాలను ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను కూడా వలంటీర్ల సహాయంతో అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న వలంటీర్లకు ప్రభుత్వం ప్రకటించిన సేవా పురస్కారాలను మంత్రి చేతుల మీదుగా వలంటీర్లకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, ఎంపీటీసీ సభ్యుడు కోళ్ల లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్మన్ జంపన వెంకట ఫకీరు, ఆర్బీకే చైర్మన్ పర్ణం పెదబాబు, ఏపీఎస్ఎఫ్‌సీసీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, నాయకులు గొరిపర్తి రవికుమార్, మోటేపల్లి రత్నారావు, తలుపుల వెంకట కృష్ణారావు, షేక్ ఫైజుల్ రహమాన్, బీరం రాజా, ఎంపీడీఓ డి.సుబ్బారావు, తహసీల్దారు బి.విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆకులమన్నాడులో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

సంక్షేమంలో వినూత్న ఆలోచనలు..

నంగేగడ్డ(నాగాయలంక): ప్రజా సంక్షేమంలో వినూత్న ఆలోచనలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి అన్నారు. నంగేగడ్డలో 505, భావదేవరపల్లిలో 122 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. మండల ప్రత్యేకాధికారి జి.విజయలక్ష్మి, సర్పంచ్‌లు తోట లంకమ్మ, మండలి ఉదయభాస్కర్, మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు ముమ్మారెడ్డి చంటి, తోట సాయిబాబు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ జె.విమల కుమారి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి అండ..

పెడన: పేదల అభున్నతికి జగనన్న సురక్ష కార్యక్రమం మరింత అండగా ఉంటోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ ఫలాలను పొందడానికి వీలుగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని మున్సిపల్ యూర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఏడో సచివాలయం పరిధిలోని 18, 19వ వార్డులకు సంబంధించిన జగనన్న సురక్ష శిబిరం సచివాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా 587 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, శిరివెళ్ల జయేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొమట్ల అనిల్, మున్సిపల్ కమిషనర్ బి మహేంద్ర, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

● మండల పరిధిలోని గురువిందగుంట గ్రామ సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో 181 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీపీ రాజులపాటి వాణి, మాజీ ఎంపీపీ అచ్యుతరావు, సర్పంచ్ పుప్పాల స్వరూపారాణి, సర్పంచుల సంఘ మండల అధ్యక్షుడు భైరవలింగం, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీవో రెడ్డయ్య పాల్గొన్నారు.



అవనిగడ్డలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

700 సర్టిఫికెట్ల పంపిణీ..

అడపావారిపాలెం(మోపిదేవి): ఒక్క సచివాలయం పరిధిలోనే ఐదు రోజుల వ్యవధిలో 700లకు పైగా సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందించేందుకు సహకరించిన వలంటీర్లు అభినందనీయులని పీఏసీఎస్ చైర్ పర్సన్ పండలనేని అన్నపూర్ణ అన్నారు. అడపావారిపాలెంలో సచివాలయం-2 వద్ద శుక్రవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. సర్పంచ్ అరజా సంధ్యారాణి అధ్యక్షత వహించారు. తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ మాట్లాడారు. అనంతరం వలంటీర్లను, సచివాలయ ఉద్యోగులను సన్మానించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ పండలనేని శివప్రసాద్, సచివాలయ కన్వీనర్ కోళ్లపల్లి గణేష్ గాంధీ, ఎంపీడీవో రామలింగేశ్వరావు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధితోనే పెట్టుబడులు వస్తున్నాయి

పురిటిగడ్డ(చల్లపల్లి): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం పురిటిగడ్డ గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ మాతంగి రమ్య అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. లబ్ధిదారులకు 305 సర్టిఫికెట్లు అందజేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సేవలు మరింత విస్తృతం..

అవనిగడ్డ: సేవలను మరింత విస్తృతం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక సెవెంత్‌డే స్కూల్ ఆవరణలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 1,156 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ ఉమా పాల్గొన్నారు.

బంటుమిల్లి, సాతులూరులో..

బంటుమిల్లి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్ల సాయంతో లబ్ధిదారుల చేతుల్లోకి ఉచితంగా సర్టిఫికెట్లు అందుతున్నాయని మంత్రి జోగి రమేష్ అన్నారు. శుక్రవారం బంటుమిల్లి-2, సాతులూరు గ్రామ సచివాలయాల వద్ద జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. బంటుమిల్లి-2లో 445, సాతులూరులో 85 ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారికి పచ్చతోరణం

చల్లపల్లి: జాతీయ రహదారి -216కు ఇరువైపులా నాలుగు కిలోమీటర్ల మేర మొక్కలు నాటుతున్నామని స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీఆర్కే ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక జాతీయ రహదారికి ఇరువైపులా స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు, చల్లపల్లి మోటారు సైకిల్ మెకానికల్ అసోసియేషన్ ప్రతినిధులు 200 మొక్కలు నాటారు.

వెండి బిందె సమర్పణ

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి చల్లపల్లి వాస్తవ్యులు గాదంశెట్టి వెంకటేశ్వరరావు కుమారుడు వెంకట సాయి అఖిల్ 500 గ్రాముల వెండి బిందెను సమర్పించారు. శుక్రవారం ఉదయం స్వామి వారిని దర్శించుకున్న గాదంశెట్టి కుటుంబ సభ్యులు ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు వెండి బిందెను అందజేశారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ

టి.కొత్తపాలెం(నాగాయలంక): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గ్రామంలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం ఆషాఢ సారె సమర్పణ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో అమ్మవారికి ఆషాఢ సారె కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా జరిపారు. టి.కొత్తపాలెం, తలగడదీవి పరిసర గ్రామాల ప్రజలు ఈ ఉత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివార్లను సుందరంగా అలంకరించారు. సర్పంచ్ బండ్రెడ్డి శివపార్వతి, టీటీడీ హిందూ పరిషత్ మండల ధర్మాచార్యులు రేమాల శ్రీనివాసరావు, బండ్రెడ్డి ఆదినారాయణ, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనాంచారమ్మకు..

చల్లపల్లి: లక్ష్మీపురంలోని బాలా త్రిపుర సుందరీ సహిత లక్ష్మీ నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాడ సారె ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం అమ్మవార్లకు భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి విశేష కుంకుమ పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబదేవి

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలి

నాగాయలంక: నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఎంఆర్‌పీకే విక్రయించాలని అవనిగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.జయప్రద అన్నారు. మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఎరువువులు, పురుగు మందుల డీలర్లకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్లు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ సంబంధమైన అంశాలను వివరించారు. 2023-24 వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్నందున ఎటువంటి అక్రమాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని ఎరువుల డీలర్లను హెచ్చరించారు. ఏఓ అన్నలూరు సంజీవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ డీలర్లు బండ్రెడ్డి చినబాబు, శ్రీరాంభూపాల్, చిట్టా శివనాగేశ్వరరావు, ఎరువుల వ్యాపారులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



అవనిగడ్డ: అమరావతి రాజధానిలో పేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేయడంపై వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుత్రం బసవయ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్, నందిగం సురేష్, కైలే అనిల్‌కుమార్, మొండితోక అరుణ్‌కుమార్ పిలుపు మేరకు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, అవనిగడ్డ, దక్షిణ చిరువోలులంక సర్పంచ్‌లు గొరుముచ్చు ఉమా, సనకా సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ శాకంబరి మహోత్సవం

నాగాయలంక: కృష్ణానది తీరం శ్రీరామపాదక్షేత్రం ఘాట్ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం శాకంబరి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ముదునూరి శ్రీనివాసశాస్త్రి బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని శాంకంబరిగా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, బోయపాటి రాము తదితరుల పాల్గొన్నారు.

శాకంబరి మాతగా గణపేశ్వరం దుర్గమ్మ..

మండలంలోని చారిత్రక ప్రసిద్ధి కలిగిన దుర్గా, గణపేశ్వరస్వామి ఆలయాల్లో శుక్రవారం శాకంబరి ఉత్సవం జరిగింది. గర్భాలయంలోని అమ్మవారిని, ఆలయ ముఖ మండపాన్ని కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించారు. గణపేశ్వర స్వామివారి ఆలయంలో శివలింగాన్ని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మండల శ్రీరామచంద్రమూర్తి, అరుణ దంపతులు పర్యవేక్షించారు. మండలంలోని దీనదయాళపురం గ్రామంలోని సముద్రాల అంకమ్మతల్లిని కూరగాయలతో అలంకరించారు.



శాకంబరి అలంకరణలో కనకదుర్గమ్మ అమ్మవారు

శాకంబరిగా రాజరాజేశ్వరి అమ్మవారు..

మచిలీపట్నంటౌన్: నగరంలోని పర్వత వర్ధిని రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారు శుక్రవారం శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాంగకర్త పొక్కునూరి మాధవశర్మ భక్తులకు పంచాంగాన్ని వివరించారు. ఆలయ ఈఓ సుబ్బారెడ్డి పర్యవేక్షించారు.